

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

# అభివృద్ధిని చూడండి.. బీఆర్ఎస్‌ను ఆదరించండి

**ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటవీరయ్య**

సత్తుపల్లి రూరల్, నవంబర్ 14: నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లోనూ తనను ఆదరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య కోరారు. గడిచిన మూడు పర్యాయాలు ఇక్కడి నుంచే గెలుపొందిన తాను సత్తుపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశానని అన్నారు. మరోసారి అవకాశమిస్తే మరింతగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ సహకారంతో రూ.1,000 కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. సత్తుపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. కిష్టారం, చెరుకుపల్లి, యాతాలకుంట, రేగళ్లపాడు, బాసారం తదితర గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ మట్టి రోడ్ల స్థానంలో సీసీ, బీటీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. సత్తుపల్లిలో 100 బెడ్ల ఆసుపత్రి, ప్రతి గ్రామంలోనూ పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు. ప్రతిపక్ష నాయకుల మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వారివన్నీ మోసపూరిత వాగ్దానాలేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మామిళ్లపల్లి కృష్ణయ్య, పాలకుర్తి సునీత, కూసంపూడి నర్సింహారావు, యాగంటి శ్రీనివాసరావు, కొలపనేని అశోక్, మోదుగు పుల్లారావు, లక్ష్మీనారాయణ, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొడిమెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు..**

కిష్టారం మాజీ సర్పంచ్ భిక్షపతి, ఆయన అనుచరుడు నాగరాజుతోపాటు యాతాలకుంటలో కాంగ్రెస్‌కు చెందిన పలు కుటుంబాల వారు ఎమ్మెల్యే సండ్ర ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# సీఎం కేసీఆర్ వల్లే తెలంగాణ అభివృద్ధి

**బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్**



పార్టీలో చేరిన వారితోబానోత్ మదన్‌లాల్

కారేపల్లి, నవంబర్ 14: సీఎం కేసీఆర్ వల్లే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అందుకని ఈ ఎన్నికల్లో కూడా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కారేపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. ఉసిరికాయలపల్లి, సీతారాంపురం, చిన్నమడెంపల్లి, గాదెపాడు, మాణిక్యారం, ఎర్రబోడు, కొమ్ముగూడెం, కోమట్లగూడెం, గిద్దెవారిగూడెం, వెంకిట్యాతండా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు గంగిరెద్దుల్లా ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చిపోయే నాయకులను నమ్మి మోసపోవద్దని సూచించారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాల్పంచుకుంటున్న తనను ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు కారేపల్లి ఎన్నికల కార్యాలయంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు గంగరబోయిన మురళి ఆధ్వర్యంలో పొంగులేటి యూత్‌కు చెందిన 50 మంది యువకులు, ఉసిరికాయలపల్లిలో స్థానిక ఎంపీటీసీ మూడు జ్యోతిమోహన్, బీఆర్ఎస్ నాయకులు జాలా సాంబ, వెంకట్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 40 కుటుంబాల వారు మదన్‌లాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మాలోత్ శకుంతల, వాంకుడోత్ జగన్, రావూరి శ్రీనివాసరావు, పెద్దబోయిన ఉమాశంకర్, వీరేందర్, సత్యనారాయణ, హన్మకొండ రమేశ్, ఐలయ్య, గౌసుద్దీన్, మంగీలాల్, అడప పుల్లారావు, బత్తుల శ్రీనివాసరావు, మాలోత్ కిశోర్, బానోత్ కుమార్, బానోత్ మారూ, ఆదినారాయణ, అజ్మీరా నాగేశ్వరరావు, ఎండీ హనీఫ్, వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, ప్రభాకర్, మత్రు, సురేశ్, చందూనాయక్, మురళి, రాము, కోటి, కల్యాణ్ పాల్గొన్నారు.

# తుమ్మల.. వెన్నుపోటుదారుడు

- ఖమ్మం రోడ్‌షోలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజయ్



రోడ్ షోలో అభివాదం చేస్తున్న మంత్రి అజయ్



ఎన్నికల ప్రచారంలో జనవాహిని

ఖమ్మం, నవంబర్ 14: కాంగ్రెస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వెన్నుపోటుదారుడని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. అప్పట్లో ఆయనకు మంత్రి పదవి ఇచ్చిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌ను, ఇటీవల మంత్రి పదవి ఇచ్చిన ఇప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మోసం చేసింది తుమ్మల నాగేశ్వరరావేనని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలనలో త్రీటౌన్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, చెందుతోందని స్పష్టం చేశారు. కానీ పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అక్కడి అభివృద్ధి ఆగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఇక్కడి వాడినని, ఇక్కడే చదువుకున్నానని అన్నారు. కానీ ఖమ్మంపై తనకు ఉన్నంత ప్రేమ బయట నుంచి వచ్చిన వ్యక్తికి ఉండదని స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా ఖమ్మం నగరంలో మంగళవారం పర్యటించిన ఆయన.. త్రీటౌన్‌ని 33, 34, 35, 36 డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. తాను ఖమ్మం బిడ్డనని, అందుకే ఇక్కడి ప్రజలు తనను ఆదరించి రెండుసార్లు గెలిపించారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా మరోసారి గెలిపించాలని కోరారు. గతంలో తనపై గెలవలేక పోయిన తుమ్మల నాగేశ్వరరరావు.. ఈ ఎన్నికల్లో తన నామినేషన్‌ను తిరస్కరించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని అన్నారు.

**తుమ్మల జీవితమంతా అధర్మపోరాటమే..**

తుమ్మల నాగేశ్వరరావు జీవితమంతా అధర్మపోరాటమేనని అజయ్ విమర్శించారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవరినీ ఎదగనివ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ గెలిస్తేనే ఇకముందు కూడా ఖమ్మం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఒకప్పుడు కనీస సదుపాయాలు లేని ఖమ్మాన్ని నేడు ఆదర్శవంతంగా తీర్చిదిద్దానని గుర్తుచేశారు. సీఎం కేసీఆరే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని, అందుకోసం కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆయనను సీఎం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్‌జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషణం, తోట ఉమారాణి, వీరభద్రం, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, పసుమర్తి రామ్మోహన్‌రావు, నున్నా మాధవరావు, మెంతుల శ్రీశైలం, చిన్ని కృష్ణారావు, మాటేటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటే గోస.. బీఆర్ఎస్ అంటే భరోసా

- ఏదులాపురం ప్రచారంలో ఎంపీ నామా నాగేశ్వరరావు
- ఖమ్మం రూరల్ మండలంలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం



ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ, చిత్రంలో ఎంపీ నామా

ఖమ్మం రూరల్, నవంబర్ 14: కాంగ్రెస్ అంటే ప్రజలకు గోస అని, బీఆర్ఎస్ అంటే భరోసా అని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పొరపాటున కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజలకు మరోసారి గోస తప్పదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం, గొల్లగూడెం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి రోడ్ షోల్లో మాట్లాడారు. కందాళ కుటుంబానికి, ఈ ప్రాంత ప్రజలకు విడదీయరాని అనుబంధం ఉందని అన్నారు. అదీగాక ఈ ఐదేళ్లలో స్థానిక ఎమ్మెల్యేగా కందాళ ఉపేందర్‌రెడ్డి పాలేరును అద్భుతంగా అభివృద్ధి చేశారని అన్నారు. తాను కూడా ఈ ప్రాంతం నుంచి రైల్వేలైన్ వెళ్లకుండా ఉండేందుకు పార్లమెంట్‌లో కొట్లాడానని వివరించారు. ఈ రాష్ట్రం కేవలం సీఎం కేసీఆర్ చేతిలో ఉంటేనే సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రజలు కూడా ఇదే నమ్ముతున్నారని అన్నారు. అందుకని మరోసారి కూడా బీఆర్ఎస్ గెలిపించాలని కోరారు.

**బయటి వ్యక్తులకు పాలేరులో స్థానం లేదు: కందాళ**

పాలేరు నియోజకవర్గంలో బయటి వ్యక్తులకు స్థానం లేదని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గతంలో ఎంపీగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి అప్పట్లో ఒక్క రోజు కూడా ఈ గ్రామాల్లో పర్యటించలేదని, ఇక్కడి ప్రజల బాగోగులు పట్టించుకోలేదని విమర్శించారు. తాను మాత్రం ఇక్కడి ప్రజల కష్ట సుఖాల్లో తోడుగా నిలిచానని, తన శక్తి మేరకు సహాయ సహకారాలూ అందించానని గుర్తుచేశారు. ఈసారి కూడా తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బానోత్ చంద్రావతి, తాళ్లూరి జీవన్‌కుమార్, బెల్లం వేణుగోపాల్, బెల్లం ఉమ, యండపల్లి వరప్రసాద్, గూడ సంజీవరెడ్డి, యాతాకుల భాస్కర్, వెంపటి ఉపేందర్, మైబెల్లి సాహెబ్, నారపాటి రమేశ్, గరుడ రమేశ్, దట్ల ప్రసాద్, తరుణ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మళ్లీ పాత రోజులే..

**ముదిగొండ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు**



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న లింగాల, కొండబాల, సంభాని

ముదిగొండ, నవంబర్ 14: పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ పాత రోజులు రావడం తథ్యమని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా కాంగ్రెస్ అంటేనే మోసపూరిత పార్టీ అని విమర్శించారు. చివరికి ఆ పార్టీ 50 ఏళ్లు సేవలందించిన సీనియర్ నేత సంభాని చంద్రశేఖర్‌ను కూడా మోసం చేసిందని దుయ్యబట్టారు. 'సంభాని'ని వదులుకోవడంతోనే ఆ పార్టీ పతనం మొదలైందని స్పష్టం చేశారు. అయినా ఇక్కడి నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి ఈ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గెలిచాక హైదరాబాద్‌కు, ఢిల్లీకి చక్కర్లు కొట్టే భట్టి విక్రమార్క మనకొద్దని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లో ఉండే తనను గెలిపిస్తే సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. ముదిగొండ మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కొండబాల కోటేశ్వరరావు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని వల్లాపురం, అమ్మపేట, వనంవారి క్రిష్ణాపురం, ముత్తారం, పండ్రేగుపల్లి, ఖానాపురం, న్యూ లక్ష్మీపురం, సువర్ణాపురం, ముదిగొండ, వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో మాట్లాడారు. ఐదేళ్లకోసారి ఎన్నికలప్పుడే వచ్చే అభ్యర్థులను గెలిపిస్తే ప్రయోజనం ఏమీ ఉందని అన్నారు. ఓడిపోయినా ప్రజల వెంటే ఉంటున్న తనను ఆదరించాలని కోరారు. అనంతరం వల్లాపురంలో వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు, ప్రజలు బీఆర్ఎస్‌లో చేరగా.. వారందరికీ కమల్‌రాజు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. వనంవారి క్రిష్ణాపురం గ్రామస్తులు ఎన్నికల ఖర్చుల కోసం బీఆర్ఎస్ అభ్యర్థి లింగాలకు కొంత ఆర్థిక సాయం అందించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హరిప్రసాద్, లక్ష్మారెడ్డి, దుర్గ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, ఎర్ర వెంకన్న, లక్ష్మి, వెంకట్, ధర్మారావు, వాసు, మల్లయ్య, వెంకటేశ్వర్లు, భిక్షం, వెంకట్రావ్, సతీశ్, అనంతరాములు, కిరణ్, మాధవి, గోవింద్, ఉష, అమరయ్య, శిల్వరాజు, జక్కడర్, బాబు, అప్పిరెడ్డి, నరేందర్, వీరబాబు, కిరణ్, శ్రీను, రమేశ్, పద్మనాభం, పాపారావు, కొట్టె అపర్ణ, ఉపేందర్, సత్యవాణి, స్వాతి, కాజా, రామారావు, శ్రీనివాసరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.